# గొళ్లెం

ఏదో శబ్దమయినట్లు వినిపించే సరికి నాగరాజు కళ్లు తెరిచాడు. చీకటిగా ఉంది. కళ్ళు చీకటికి అలవాటు పడసాగాయి. లేచి కూర్చుని దిండు కిందున్న సిగరెట్ పెట్టె అగ్గిపెట్టె అందుకుని సిగరెట్ తీసి వెలిగించాడు. అగ్గిపుల్ల వెలుగులో గదిని పరీక్షగా చూశాడు. ఎక్కడి వస్తువులు అక్కడే ఉన్నాయి. కిటికీ తలుపులు మూసే ఉన్నాయి. అగ్గిపుల్ల ఆర్పి మంచం కింద పడేసి 'శబ్దం ఎక్కడి నుండి వచ్చినట్టు?' ప్రశ్నించుకున్నాడు. జవాబు దొరకలేదు. మంచం మీద పడుకున్నాడు. నిద్ర ఎగిరిపోయింది. గదిలో గాలి చల్లగా ఉంది. హఠాత్తుగా కమల గుర్తు వచ్చింది. తను సిగరెట్లు కాల్చటం కమలకు ఇష్టంలేదు. ప్రతిసారీ 'నువ్వు సిగరెట్లు తాగితే నీతో అస్సలు మాట్లాడను' అనేది. కాని మాట్లాడకుండా ఉండేదికాదు. 'ఇదే చివరిసారి. మళ్లీ సిగరెట్ ముట్టుకుంటే అప్పుడను' అనేవాడు. కమల అందగత్తేమీ కాదు. అయితే మనిషిలో ఏదో ఆకర్షణ. ఎంతసేపయినా మాట్లాడాలనిపిస్తుంది. 'కమల ఉంటే బావుణ్ణు' అనుకున్నాడు.

నాగరాజు ఈ ఊరుకు బదిలీ అయివచ్చి మూడు వారాలవుతోంది. ఈ ప్రదేశం, మనుషులు కొత్త. ఎవరెవరు ఏమిటో ఇంకా తెలుసుకునే స్థితిలోనే ఉన్నాడు. కమల కోసం కాదు కాని ఈ ఊరంటే తనకు ఇంకా నచ్చలేదు. సమయం పడుతుంది.

సిగరెట్ గది మూలకు విసిరి కళ్లు మూసుకున్నాడు. నిద్రలో మెలకువ వస్తే ఎంత ప్రయత్నించినా మళ్లీ నిద్రపట్టదు. కొత్త ప్రదేశం కావటం వలన మొదటి పదిరోజులూ నిద్రపట్టలేదు. సెలవు పెట్టి పాత ఊరికి వెళ్లిపోదామనిపించింది. అక్కడ సమయం తేలికగా గడిచి పోతుండేది. ఇక్కడలా లేదు. పెద్ద రికమండేషన్ ఉంటే తప్ప బదిలీ దొరకటం కష్టం.

లేచి, మంచం దిగి కిటికీ రెక్క తెరిచేసరికి గోడ పక్కన దాక్కున్న గాలి ఒక్కసారిగా గదిలోకి దూకింది. తువ్వాలుతో మెడకప్పుకుని కిటికీలోంచి బైటకు చూశాడు. జీడిమామిడితోట మసకగా కదులుతోంది. గాలి హోరులో నక్కల అరుపులు ఉండుండి వినిపిస్తున్నాయి. సమయం ఎంతయిందో తెలియలేదు. తన చేతిగడియారం కమల

తీసుకుంది. ఈ నెల జీతం వచ్చాక కొత్తది కొనుక్కోవాలి. లేకపోతే కష్టమయిపోతుంది. ఈ ఇల్లు కూడా మార్చాలి. పాతది. కట్టి చాలా కాలమయి ఉంటుంది. ఊరికి దూరంగా ఉండటం వలన ఖాళీగా ఉన్నట్టుంది. కాకపోతే తన ఆఫీసుకు అట్టే దూరంలో లేదు. మరో ఇల్లు దొరకకపోతే ఆఫీసులో నయినా ఉండాలి. తప్పదు. మూడు వాటాల ఇంత పెద్ద ఇంట్లో బిక్కు బిక్కుమంటూ ఉండటం ఇబ్బందిగానే ఉంది.

అంతలో గాజులు గలగల మన్న చప్పుడు వినిపించింది. తను పొరబడటం లేదు. తను విన్నాడు. అర నిమిషం తర్వాత మళ్లీ వినిపించింది. తనకు తెలిసినంతవరకు పక్క వాటాల్లో ఎవరూ ఉండటం లేదు. అంతపెద్ద ఇంట్లో తనొక్కడే ఉంటున్నాడు. ఆ శబ్దం పక్క గదిలోంచే వచ్చింది. సన్నటి నవ్వు కూడా వినిపించింది. ఆడపిల్ల నవ్వు. దయ్యాలంటే తనకు నమ్మకం లేకపోయినా, భయం కన్నా ఎవరయి ఉంటారా అన్న కుతూహలం పేరుకోసాగింది.

సాయంత్రం రామయ్య తాతతో వచ్చిన అమ్మాయా? ఏమో! ఇక్కడకు వచ్చిన తర్వాత తన పనులన్నీ రామయ్య తాతే చూసుకుంటున్నాడు. ఏ అమ్మాయితో నూ పరిచయం కాలేదు. రామయ్య తాతకు యాభయి సంవత్సరాలకన్నా ఎక్కువ ఉండవు. పుగాకు నమిలి నమిలి పళ్లన్నీ ఊడిపోవటం వలన అందరూ అతన్ని తాత అని పిలుస్తుంటారు. అతను, తను పనిచేస్తున్న ఆఫీసులోనే అటెండర్‌గా పనిచేస్తున్నాడు. పైన బడో కింద బడో కొడుక్కు కూడా రామయ్య తాత ఉద్యోగం ఇప్పించాడని, పెళ్లి జరిపించాడని ఆఫీసులో ఎవరో అంటే విన్నాడు. వచ్చిన అమ్మాయి అతని భార్య అని అప్పుడే తెలిసింది. చామనచాయలో మనిషి చక్కగా నాజూకుగా ఉంది. ఎందుకో ఎవరికీ తెలియదు కాని పట్టుమని పది నెలలు కాపరం చేయకుండా రామయ్య తాత కొడుకు దేశాలు పట్టి వెళ్లిపోయాడు. ఇంతవరకు రాలేదు. పోలీసు కంప్లెయింట్ ఇచ్చారు కాని జాడ తెలియలేదు. తిరిగి వస్తాడని ఎవరూ అనుకోవటం లేదు. అతని స్థానంలో రామయ్య తాత కోడలు పనిచేస్తోంది. రామయ్య తాత ఇల్లు బడి దగ్గిరుంది. అంతదూరం నుండి ఎవరి కంటా పడకుండా ఎలా రాగలదు? లేక ఏదయినా దగ్గిర దారి కాని ఉందా?

నాగరాజు సిగరెట్ పెట్లోంచి ఇంకో సిగరెట్ తీసి వెలిగించాడు. అదే ఆఖరి సిగరెట్టు. సిగరెట్లు అయిపోయాయి. అగ్గిపెట్టెలో కూడా రెండో మూడో పుల్లలున్నాయి. లైటు వెలిగిద్దామంటే కిరసనాయిలు లేదు. తెచ్చిస్తానన్నాడు కాని రామయ్య తాత తీసుకురాలేదు. ఇంటికి కరంటు ఉంది కాని చాలానెలలు డబ్బు కట్టలేదని కనక్షను

తీసేశారు. వారం నుండి అదో ఇవేళ ఇదో ఇవేళ అంటున్నారు కాని మాట ముందుకు కదలటం లేదు.

పక్కగదిలోంచి మళ్లీ శబ్దం వినిపించింది. గాజుల గలగల కాదు. మంచం వేసిన శబ్దంలా అనిపించింది. ఆ వెనక దుప్పటి దులిపిన శబ్దం. వెంటనే నవ్వు. ఈసారి మగ గొంతుక, బొంగురుగా ఉంది, గుసగుసల్లాటి మాటలు, ఒక్కరు కాదు. దొంగలు కారు. ప్రేమికులయి ఉంటారు. ఇక్కడ ఎవరూ ఉండరని కలుసుకోవటానికి ఇంత దూరం వచ్చి ఉంటారు. తను ఇక్కడ ఉంటున్నట్లు తెలుసో, లేదో?

చల్లటి గాలి విసురు ఎక్కువయింది. కిటికీ రెక్కలు మూసి బోల్టు పెట్ట బోయాడు కాని సరిగ్గా పడలేదు. గట్టిగా నొక్కేసరికి చిటికెన వేలు బోల్టు కింద పడి నలిగింది. నొప్పి వేసింది. చిటికెన వేలు నోట్లో పెట్టుకుంటుంటే సిగరెట్ కింద పడిపోయింది. రెండో చేత్తో అందుకుని వచ్చి మంచం మీద పడుకున్నాడు. పక్కగదిలోంచి మాటలు ఉండుండి వినబడుతున్నాయి. స్పష్టంగా లేవు. ఎక్కువగా స్త్రీస్వరమే వినిపిస్తోంది. మాటలపుట్ట అయి ఉండాలి. మధ్యలో గోడ చివరికంటా ఉంది. చివర్లో చిన్న వెంటిలేటరు. గదిలో లైటు వెలుగుతోంది. కొవ్వొత్తి అయి ఉంటుంది. వెలుగు అటూ ఇటూ కదులుతోంది.

సిగరెట్ చివరంటా కాల్చి గది మూలకు విసిరి కళ్లు మూసుకున్నాడు నాగరాజు. అరగంట నిద్రపోయి ఉంటాడేమో గాలి విసురుకు పెద్ద శబ్దంతో కిటికీ రెక్కలు తెరుచుకునే సరికి ఉలికిపాటుతో నిద్రలేచాడు. పొంచి ఉన్న గాలి రెప్పపాటులో గదంతా ఆక్రమించుకుంది. పై కొద్ది వెలుతురు మినహా గదిలో చీకటి చిక్కగా కప్పులోంచి కురుస్తోంది. పక్కగదిలో ఎవరో నడుస్తున్న చప్పుడు నిలబడి, "ఇప్పుడెలా?" బొంగురు గొంతు మాట స్పష్టంగానే వినిపించింది. "వచ్చే ముందు తెలవదా, పారిపో. దొరికావంటే చంపేస్తాడు" నింపాదిగా ఉన్నాయి ఆమె మాటలు. "మళ్ళీ ఎప్పుడు?" అడిగాడు. "ఇవేల్టికి బతికి బయటపడు. కనిపిస్తుంటావుగా చెప్తాను... త్వరగా ఇక్కడి నుండి వెళ్లు" అంది.

నాగరాజు లేచి తలుపు దగ్గిరకు వచ్చి నిలబడ్డాడు. ఎవరో పరుగెట్టి వెళ్లిపోయిన చప్పుడు వరండా దిగి చీకట్లో కలిసిపోయింది. ఆమె ఇంకా అక్కడే ఉందో, వెళ్లిపోయిందో అర్థంకావటం లేదు. కొవ్వొత్తి వెలుగు ఆరిపోలేదు. రెండు నిమిషాలు కూడా అయి ఉండదు, పరుగెత్తుకుంటూ పక్కగదిలోకి ఎవరో వచ్చి లాగి ఆమె చెంపమీద కొట్టినట్టుంది. ఆమె ఏడవటం మొదలెట్టింది.

"వాడెవడే?" రామయ్య తాత గొంతు.

జవాబు లేదు.

ఆమె రామయ్య తాత కోడలా, కాదా? నాగరాజుకు అర్థం కావటంలేదు. రామయ్య తాత ఆమెను కొట్టడానికి మళ్లీ చేయి ఎత్తినట్లుంది. "ఈసారి నా మీద చేయి పడిందంటే మర్యాదగా ఉండదు" ఏడుస్తూనే అంది.

"చెప్పు. ఎవడువాడు?"

"..... .... ...."

"కొత్తగా మన ఆఫీసులో చేరిన ఆయనా?"

"... ... ..."

"జవాబు చెప్పవేమే?"

ఆమె ఏడుస్తూనే ఉంది.

"మళ్ళీ కొట్టకపోయినా ఎందుకా ఏడుపు? ఆ కొత్తాయనేనా... ఉండు వాడి పని పడ్తాను... నాలుగు తగిలిస్తే కాని నీ పులుసు అణగదు...." పక్కగదిలోంచి తన గది ముందుకు వచ్చినట్లనిపించింది నాగరాజుకు. వెంటనే రామయ్య తాత పక్క గదిలోకి వెళ్ళినట్లుంది. "లేదు. ఉండుంటేనా....? పద... ఇంటికి పద... ఇంత బరితెగించి పోయావేమే, నిన్ను... నిన్ను..." అంటున్నాడు.

"వస్తాను. ముందు నా చేయి వదులు."

రామయ్య తాత ఆమెను తిడుతూనే ఉన్నాడు. వెళ్ళిపోతున్న అడుగులు దూరమయి వినిపించటం మానేశాయి. నాగరాజు అయిదు నిమిషాలవరకు తలుపు దగ్గర కదలకుండా నిలబడి తలుపు గడి తీసి వెనక్కి లాగాడు. రాలేదు. మళ్లీ గట్టిగా లాగాడు. బయట గొళ్లెం పెట్టి ఉంది. దానికి తాళం కూడా వేసి ఉంది.

◆ చుక్కాని, పక్షపత్రిక. 1 జనవరి 1967